సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం । 18 । జూలై । 2024



టన్ను చీనీ రూ.19 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.19 వేలు, కనిష్టంగా రూ.10 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి



టమాట కిలో రూ.62
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.62, కనిష్టంగా రూ.44, సరాసరిన రూ.54 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి

గరిష్టం/కనిష్టం
34.8°/23.2°
జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై పలు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 10 నుంచి 14 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

సిగ్నళ్ల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

- డీఆర్‌ఎం విజయ్‌కుమార్



సౌత్ క్యాబిన్‌లో సిగ్నల్ పాయింట్ల పని తీరును తెలుసుకుంటున్న డీఆర్‌ఎం

గుంతకల్లు: సిగ్నళ్లు, పాయింట్లు నిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని డీఆర్‌ఎం విజయ్‌కుమార్ అన్నారు. గుంతకల్లు రైల్వేస్టేషన్ సమీపంలోని సౌత్ సిగ్నల్ క్యాబిన్ తోపాటు గుంతకల్లు–గుత్తి రైలు మార్గాన్ని అకారులతో కలిసి బుధవారం ఆయన తనిఖీ చేశారు. సౌత్ క్యాబిన్‌లో సిగ్నళ్లపై సిబ్బందికి ఏ మేరకు అవగాహన ఉందో పరీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిగ్నల్ పాయింట్ల నిర్వహణలో లోపాల కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. లోటు పాట్లకు ఆస్కారం ఇవ్వకుండా సమర్థవంతంగా విధులు నిర్వహించాలన్నారు. అనంతరం గుంతకల్లు–గుత్తి రైలు మార్గం తనిఖీ చేశారు. ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా అన్ని విభాగాల సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. రైల్వే లైన్లు పటిష్టంగా ఉండాలని, ఏవైనా లోపాలు ఉంటే సరిదిద్దాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో రైల్వే సిబ్బంది ఉన్నారు.

సెక్యూరిటీ గార్డు ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిలమత్తూరు: ప్రముఖ ఎమ్ఎన్‌సీ కంపెనీల్లో సెక్యూరిటీ గార్డు ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కొడికొండ చెక్‌పోస్ట్‌లోని రక్షా అకాడమీ హెడ్ ట్రైనీ కిరీట్ నాయర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బెంగళూరులోని పలు మల్టీనేషనల్ కంపెనీల్లో సెక్యూరిటీ గార్డులుగా పని చేసేందుకు పురుష , మహిళా అభ్యర్థులకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. జీతం రూ.19 వేలు ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు రక్షా అకాడమీలో శిక్షణ ఇస్తామన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణత సాధించి 18–30 ఏళ్ల లోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. కన్నడ, ఇంగ్లిష్ భాషలు తెలిసి ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 6281557937, 6300676517 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నిండుకుండలా టీబీ డ్యాం



నీటితో తొణికిసలాడుతున్న తుంగభద్ర జలాశయం

బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయం నిండుకుండలా మారింది. బుధవారం ఒక్కసారిగా ఇన్‌ఫ్లో పెరిగింది. డ్యాం ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు వరద పోటెత్తడంతో ఇన్‌ఫ్లో 49,522 క్యూసెక్కులకు చేరింది. గురువారం ఉదయానికి 63 వేల క్యూసెక్కులకు చేరవచ్చని జలాశయ అధికారులు తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో 105.788 టీఎంసీల పూర్తి నీటి నిల్వ సామర్థ్యానికి గానూ 39.718 టీఎంసీలకు పైగా నీరు నిల్వ ఉంది. 1,633 అడుగుల నీటి మట్టానికి గాను 1,611.07 అడుగులకు నీరు చేరాయి. అవుట్‌ఫ్లో 212 క్యూసెక్కులు నమోదవుతోంది.

హెచ్చెల్సీకి నీటిని విడుదల చేయండి

- తుంగభద్ర బోర్డుకు హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్ లేఖ

అనంతపురం సెంట్రల్: హెచ్చెల్సీకి ఈనెల 21 నుంచి నీటిని విడుదల చేయాలని హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తుంగభద్ర బోర్డుకు లేఖ రాశారు. తుంగభద్ర జలాశయానికి భారీగా వరద వచ్చి చేరుతోందన్నారు. ఇప్పటికే అత్యధికంగా 71,231 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైందన్నారు. ప్రస్తుతం జలాశయంలో నీటి నిల్వ 40 టీఎంసీల వరకూ చేరుకుందని, డ్యాం త్వరితగతిన గరిష్ట మట్టానికి చేరుకునే అవకాశమున్న నేపథ్యంలో హైలెవల్ మెయిన్ కెనాల్ (హెచ్చెల్సీ)కి నీటిని విడుదల చేయాలని కోరారు. ఈ నెల 21 నుంచి 500 క్యూసెక్కుల చొప్పున ప్రారంభించి, ఆ తర్వాత క్రమంగా పెంచుకుంటూ పోవాలని విజ్ఞప్తి చేశారు. ఈనెల 19న బోర్డు అధికారులు ప్రధాన కాలువ పరిశీలిస్తారని, ఆ తర్వాత నీటి విడుదలపై నిర్ణయం తీసుకుంటారని ఎస్‌ఈ విలేకరులకు తెలియజేశారు. కర్ణాటకలో వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో తుంగభద్ర జలాశయానికి వరద పెరుగుతోందని, ఇది శుభపరిణామంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

మొహర్రం.. భక్తసాగరం

- పీర్ల బేటీతో జనసంద్రమైన బత్తలపల్లి
- డప్పు మోతలు, ఈలలతో అలావ్ తొక్కిన యువత
- పొర్లుదండాలతో మొక్కులు తీర్చుకున్న భక్తులు
- భేటీ ప్రశాంతంగా ముగియడంతో ఊపిరిపీల్చుకున్న పోలీసులు

బత్తలపల్లి: డప్పు మోతలు.. యువకుల ఈలలు, నృత్యాలతో బత్తలపల్లి జనసంద్రమైంది. ఎటు చూసినా జనమే జనం. బత్తలపల్లి పీర్ల బేటీకి రాష్ట్రంలోనే ఎంతో పేరుంది. చుట్టు పక్కన ఉన్న గ్రామాల పీర్లన్నీ బుధవారం ఒక్కచోట చేరడంతో భక్తిభావం వెల్లివిరిసింది. పెద్ద, చిన్న ఖాశీంస్వామితో పాటు వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన పీర్లన్నీ బేటీ కావడంతో భక్తులు పెద్ద ఎత్తున మొక్కులు తీర్చుకున్నారు. పొర్లు దండాలు, చక్కెర చదివింపులు చేస్తూ తమ కష్టాలు తీర్చాలని వేడుకున్నారు. మండల పరిధిలోని పోట్లమర్రి, గంటాపురం, వేల్పుమడుగు, రాఘవంపల్లి, ముష్టూరు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. బత్తలపల్లి కూడలి నాలుగు రోడ్లకు ఇరువైపులా కిలో మీటర్ల మేర వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఈ సందర్భంగా హిందువులు, ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని సంతోషాన్ని వ్యక్తం చేశారు. భక్తులకు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. అవాంచనీయ ఘటనలు జరగకుండా ధర్మవరం రూరల్ సీఐ ఆరోహణరావు, బత్తలపల్లి ఎస్‌ఐ శ్రీనివాసులు, 50 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. బేటీ తర్వాత ఆయా గ్రామాల పీర్లు ఆయా గ్రామాలకు తరలివెళ్లాయి. సాయంత్రం అగ్నిగుండం ప్రవేశం తర్వాత జలధి కార్యక్రమాన్ని నిర్వహించారు.



పీర్ల బేటీతో జనసంద్రమైన బత్తలపల్లి నాలుగురోడ్ల కూడలి



ఊరేగుతున్న వివిధ గ్రామాల పీర్లు




అలావ్ తొక్కుతున్న యువకులు



పొర్లు దండాలతో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

ధర్మవరంలో దౌర్జన్యకాండ!

- అక్రమాలకు తెరలేపిన కూటమి నేత
- సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి దందా
- తనకు తెలీకుండా రిజిస్ట్రేషన్లు చేయకూడదని అల్టిమేటం
- బెదిరింపులతో రూ.4.50 కోట్ల భూమిని కాజేసిన వైనం !



సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చీరాగానే నాయకులు అవినీతి దందాకు తెరలేపారు. ముఖ్యంగా వాణిజ్య కేంద్రమైన ధర్మవరంలో కూటమికి చెందిన ఓ కీలక నేత వ్యవహార శైలి అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏ పని జరగాలన్నా తమ అనుమతి తప్పనిసరంటూ ఆయన హుకుం జారీ చేశారు. డబ్బులు వసూలు చేయాలన్న కాంక్షతో ఏకంగా దస్తావేజు లేఖరులను ఇంటికి పిలిపించుకుని తమ అనుమతి లేనిదే ఏ డాక్యుమెంట్ రాయకూడదంటూ అనుచరుల ద్వారా అల్టిమేటమిచ్చారు. తమ ఆదేశాలు దిక్కరిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరికలు జారీ చేశారు.

నెలవారీ మామూళ్ల కోసమే...

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి నెలవారీ మామూళ్లు రాబట్టుకోవాలని కీలక నేత ప్లాన్ చేసినట్లు తెలిసింది. భూ యజమానుల నుంచి డబ్బులు వసూలు చేసి జేబులు నింపుకోవాలన్నది ఆయన టార్గెట్. ఈ నేపథ్యంలో ధర్మవరం పట్టణంలో రియల్టర్లు, భూ యజమానులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. డాక్యుమెంట్లన్నీ సక్రమంగా ఉన్నప్పటికీ రిజిస్ట్రార్లు చేసుకునే క్రయ, విక్రయదారులు సదరు నేత కార్యాలయానికి డాక్యుమెంట్ రైటర్ల ద్వారా సమాచారం ఇచ్చి ఆయన అంగీకరిస్తే రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

అప్పనంగా రూ.4.5 కోట్ల భూమి..

ధర్మవరం మండల పరిధిలోని రేగాటిపల్లి పంచాయతీ పరిధిలో సర్వే నంబర్ 293, 294లలో హిందూపురానికి చెందిన వారికి 23 ఎకరాల భూమి ఉంది. ఇందులో భాగంగానే వారు భూమిలో కొంత భాగం ప్లాట్లు వేసి విక్రయించేలాగా, మరికొంత భాగం విల్లాలు కట్టి విక్రయించేలాగా లేఅవుట్ వేశారు. అనుకున్న ప్రకారం భూమిలో సగభాగం పైగా విక్రయాలు జరిపి విల్లాలను నిర్మిస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉన్న మిగిలిన ప్లాట్‌లను విక్రయించేందుకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సంప్రదించగా సదరు కూటమి నేత అంగీకరిస్తేనే రిజిస్ట్రేషన్ చేస్తామని అధికారులు, దస్తావేజు లేఖరులు చెప్పడంతో వారు అవాక్కయ్యారు. తమ భూములు అన్ని సక్రమంగా ఉన్నాయని ఎందుకు రిజిస్ట్రేషన్ ఆపుతున్నారని భూయజమానులు అడిగినా అధికారులు మాత్రం పట్టించుకోలేదు. దీంతో గత్యంతరం లేక సదరు నేత అనుచరులను భూ యజమానులు సంప్రదించగా లేఅవుట్‌లో ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న 65.73 సెంట్ల స్థలాన్ని తమ నాయకుడి పేరిట రాసివ్వాలని, అలా చేస్తే తాము అడ్డుచెప్పమని సమాధానం ఇచ్చారు. దీంతో చేసేదిలేక సదరు భూయజమానులు కూటమి నేత అనుచరుడికి రిజిస్టర్ చేయించినట్లుగా సమాచారం. ఆ భూమి విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.4.50 కోట్లకు పైగానే ఉంది. కోట్ల రూపాయాలు పోగొట్టుకున్నామని సదరు భూయజమానులు ఎవరికీ చెప్పుకోలేక తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని తెలిసింది. ఏది ఏమైన ఇన్నాళ్లు ప్రశాంతంగా ఉన్న ధర్మవరంలో కూటమి నేతలు దౌర్జన్యకాండకు తెరలేపడంతో సామాన్యులు సైతం హడలిపోతున్నారు.

వైభవంగా ఏకాదశి వేడుకలు

ప్రశాంతి నిలయం: తొలి ఏకాదశి వేడుకలు ప్రశాంతి నిలయంలో ఘనంగా జరిగాయి. మహారాష్ట్ర , గోవా రాష్ట్రాలకు చెందిన వేలాదిమంది భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఇందులో భాగంగానే సత్యసాయి మహాసమాధి, సాయికుల్వంత్ సభా మందిరాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. బుధవారం ఉదయం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహా సమాధి చెంత వేదపఠనంతో ఏకాదశి వేడుకలు ప్రారంభమయ్యాయి. దిండి నుంచి తీసుకొచ్చిన పల్లకీని ఊరేగింపుగా సత్యసాయి మహాసమాధి చెంతకు తీసుకువచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తిగీతాలతో ముంబయికి చెందిన బాలవికాస్ చిన్నారులు నిర్వహించిన నాటిక అందరినీ అలరించింది.



ప్రత్యేక అలంకరణలో సత్యసాయి మహాసమాధి



భక్తి గీతాలకు నృత్యం చేస్తున్న బాలవికాస్ చిన్నారులు



చిన్నికృష్ణయ్యను కీర్తిస్తూ సాగుతున్న నృత్యరూపకం

జిల్లాకు మరింత పేరు తెచ్చేలా పనిచేయండి



ఎస్పీ మాధవరెడ్డి ఉన్న ఓపెన్ టాప్ జీపును తాళ్ల సాయంతో లాగుతున్న సిబ్బంది

పుట్టపర్తి టౌన్: 'జిల్లాకు మరింత మంచి పేరు తీసుకొచ్చే విధంగా విధులు నిర్వహించాలి. వచ్చే అధికారులకు ఇదే సహకారం అందించండి' అని ఎస్పీ మాధవరెడ్డి పేర్కొన్నారు. బదిలీ పై వెళ్తున్న ఎస్పీ మాధవరెడ్డికి బుధవారం పరేడ్ గ్రౌండ్‌లో ఏఆర్ కానిస్టేబుళ్లు ఆత్మీయ వీడ్కోల పరేడ్‌ను నిర్వహించారు. ముందుగా పరేడ్ కమాండెంట్‌గా వ్యవహరించిన రవికుమార్ నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. తర్వాత ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఎస్పీ మాధవరెడ్డి పరేడ్‌ను పరిశీలించారు. అనంతరం ప్లటూన్ల వారీగా గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాధవరెడ్డిని ఓపెన్ టాప్ జీపులో ఎక్కించి పోలీసు సిబ్బంది తాళ్లతో లాగి తమ అభిమానాన్ని చాటుకుంటూ వీడ్కోలు పలికారు. ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ తాను పనిచేసిన 15 నెలల కాలంలో చేపట్టిన ప్రతి కార్యక్రమానికి పోలీస్ అధికారులు సిబ్బంది అందించిన సహకారం మరువలేనిదన్నారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో పోలీస్ అధికారుల కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఆర్‌ఐలు చంద్రశేఖర్, వలి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌శాఖపై ప్రజల్లో విశ్వాసం పెంచుతాం

- ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన వి.రత్న



పుట్టపర్తి టౌన్: పోలీసు శాఖపై ప్రజల్లో విశ్వాసం పెంచేలా పనిచేస్తామని నూతన ఎస్పీ వి.రత్న తెలిపారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఆమె బాధ్యతలు స్వీకరించారు. ముందుగా పోలీసు సిబ్బంది గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం అర్చకులు వేదమంత్రాలు, పూర్ణకుంభంతో ఆహ్వానించగా ప్రత్యేక పూజల తర్వాత విధుల్లో చేరారు. అడిషనల్ ఎస్పీ విష్ణు, ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, సీఐలు, ఎస్‌ఐలు, పోలీస్ అసోసియేషన్ సభ్యులు, కార్యాలయ సిబ్బంది ఎస్పీని మార్యద పూర్వంగా కలసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. అనంతరం అడిషనల్ ఎస్పీ, డీఎస్పీలతో జిల్లా పరిస్థితులపై ఎస్పీ రత్న చర్చించారు. అనంతరం పోలీస్ కార్యాలయంలోని సోషల్ మీడియా, సైబర్ క్రైమ్, డీసీఆర్బీ, ఐటీకోర్, ఏఆర్ క్యాంటీన్ సెక్షన్ కార్యాలయాలను పరిశీలించి సిబ్బంది వివరాలు, పనితీరును అడిగి తెలుసుకున్నారు. తర్వాత ఎస్పీ రత్న విలేకరులతో మాట్లాడారు. ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన శ్రీసత్యసాయి జిల్లాకు ఎస్పీగా రావడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించి పోలీస్‌శాఖపై ప్రజల్లో విశ్వాసం పెంచుతామన్నారు. ప్రజ సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, గంజాయి విక్రయాలపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. గత సంవత్సరం కంటే ప్రస్తుత ఏడాది జిల్లాలో నేరాల సంఖ్య పెరిగిందని కట్టడికి కృషి చేస్తామన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలను నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దుతామని తెలిపారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ రత్న

నేటి నుంచి టీచ్ టూల్ అబ్జర్వేషన్‌పై శిక్షణ

హిందూపురం టౌన్: హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని పలు మండలాల ఉపాధ్యాయులకు గురువారం నుంచి 27వ తేదీ వరకు టీచ్ టూల్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కోర్సు డైరెక్టర్, మండల ఎంఈఓ గంగప్ప తెలిపారు. బుధవారం ఎంజీఎం పాఠశాలలో శిక్షణకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. పట్టణంలోని ఎంజీఎం పాఠశాలలో తొమ్మిది రోజుల పాటు హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు, పరిగి, మడకశిర, రొళ్ల, అగళి, గుడిబండ, అమరాపురం మండలాల సీనియర్ ఎస్‌జీటీ టీచర్లు, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలకు, స్కూల్ అసిస్టెంట్లకు, హెచ్‌ఎంలకు, సీఆర్‌ఎంటీలకు టీచ్ టూల్ అబ్జర్వేషన్‌పై ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.



శిక్షణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంఈఓ గంగప్ప

క్లుప్తంగా

కదిరిలో అరుదైన శస్త్ర చికిత్స

- 14 కిలోల కణితిని వెలికి తీసిన వైద్యులు


వెలికి తీసిన కణితిని చూపుతున్న వైద్యురాలు

కదిరి టౌన్: స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న రేణుక ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్సను వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. వివరాలను ఆ ఆస్పత్రి డాక్టర్ రేణుకారెడ్డి బుధవారం వెల్లడించారు. కదిరి పట్టణానికి చెందిన 43 ఏళ్ల వయసున్న ఓ మహిళ నాలుగేళ్లుగా పొట్ట వాపుతో ఇబ్బంది పడుతుండేదని తెలిపారు. అనంతపురం, బెంగళూరు తదితర ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా ఫలితం దక్కలేదన్నారు. దీంతో ఇటీవల తమ ఆస్పత్రిని బాధితురాలు సందర్శించినప్పుడు వైద్య పరీక్షల అనంతరం ఆమె గర్భాశయంలో కణితి పెరిగినట్లుగా గుర్తించామన్నారు. శస్త్రచికిత్స చేసి కణితిని తొలగించాలని సూచించామన్నారు. ఇందుకు రోగి, ఆమె కుటుంబసభ్యులు అంగీకరించడంతో తమ ఆస్పత్రిలోనే శస్త్రచికిత్సకు ఏర్పాట్లు చేశామన్నారు. డాక్టర్ అనూషతో కలసి ఆమెకు ఆపరేషన్ చేసి 14 కిలోల బరువున్న కణితిని వెలికి తీశామన్నారు. ప్రస్తుతం రోగి కోలుకుంటున్నట్లుగా పేర్కొన్నారు.

కంచిసముద్రంలో ఇరువర్గాల ఘర్షణ


చికిత్స పొందుతున్న మనోహర్

రొద్దం: మండలంలోని కంచిసముద్రం గ్రామంలో బుధవారం టీడీపీ, వైఎస్సార్‌సీపీ కార్యకర్తల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన మేరకు... వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు మనోహర్, సుమలతపై టీడీపీ కార్యకర్త రాజ్‌గోపాల్ అనుచిత వ్యాఖ్యలు చేయడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. విషయం తెలుసుకున్న టీడీపీ కార్యకర్తలు శోభ, రవీంద్ర, జయమ్మ, జయరాములు అక్కడకు చేరుకుని రాజగోపాల్‌తో కలసి దాడికి దిగారు. పరస్పర దాడుల్లో ఇరువర్గాల వారూ గాయపడ్డారు. క్షతగాత్రులను తొలుత పెనుకొండలోని ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కొందరిని అనంతపురానికి, మరికొందరిని హిందూపురంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాగా, మనోహర్ తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళితే ఎస్‌ఐ తిరస్కరించారు. బాధితుడు స్వయంగా రావాలని సూచించినట్లు సమాచారం.

నార్పలలో వరుస చోరీలు

నార్పల: మండల కేంద్రంలో వరుస చోరీలు చోటు చేసుకున్నాయి. పోలీసులు తెలిపిన మేరకు.. నార్పలలోని మసీదుకట్ట కాలనీకి ఓబయ్య మంగళవారం రాత్రి భోజనం చేసుకుని కుటుంబసభ్యులతో కలసి ఇంటిపైకి చేరుకుని నిద్రించాడు. బుధవారం వేకువజామున దుండగులు ఇంటి తాళం బద్ధలుగొట్టి లోపలకు ప్రవేశించి, బీరువాలోని 20 తులాల బంగారు నగలు అపహరించారు. అనంతరం అదే కాలనీకి చెందిన గంధోడి నాగేంద్ర ఇంట్లో చొరబడి ఐదున్నర తులాల బంగారు నగలు అపహరించుకెళ్లారు. బుధవారం ఉదయం బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రాజశేఖర రెడ్డి కేసు నమోదు చేశారు.

'కాసు'పత్రులు

- ఎలాంటి అర్హత, అనుమతుల్లేకుండా క్లినిక్‌ల నిర్వహణ
- టెస్ట్‌లు, స్కానింగ్‌ల పేరుతో దోపిడీ
- ప్రజారోగ్యంతో ఆర్‌ఎంపీల చెలగాటం



68	జిల్లాలోని ప్రైవేట్ మెడికల్ ల్యాబ్‌లు
165	రిజిస్టర్ అయిన ప్రైవేట్ ఆస్పత్రులు
1,000 వరకు	అనుమతుల్లేని క్లినిక్‌లు

సాక్షి, పుట్టపర్తి:

వైద్యో నారాయణో హరి అన్నారు పెద్దలు. అంటే వైద్యులు భగవంతుడితో సమానం అని అర్థం. అయితే ఇది ఒకప్పటి మాట. కానీ ఇప్పుడు దాని అర్థం మారింది. ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన వైద్యులే వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. కాసుల కోసం కక్కుర్తి పడి అవసరం లేకున్నా... అవసరమున్నా నిబంధనలు తుంగలో తొక్కి మరీ దోపిడీకి తెరలేపుతున్నారు. జిల్లాలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులు 'కాసు'పత్రులుగా మారాయి.

దండుకోవడమే పరమావధి..

రోగమొచ్చి ప్రైవేట్ ఆస్పత్రికి వెళితే చాలు అందిన కాడికి దండుకోవడమే పరమావధిగా నిర్వాహకులు ప్రవర్తిస్తున్నారు. నిబంధనలు తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు ఆస్పత్రుల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ప్రతి ఆస్పత్రికి అనుసంధానంగా ల్యాబ్‌లు, మెడికల్ స్టోర్లు ఉంటున్నాయి. ఇందులోనూ ఎలాంటి అర్హత లేని వారు ఇతరుల సర్టిఫికెట్‌తో నిర్వహిస్తుండడం గమనార్హం. అర్హత లేకున్నా ల్యాబ్ టెక్నీషియన్లుగా చెలామణి అవుతుంటారు. జీవమున్న శరీర నిర్మాణ శాస్త్రం (అనాటమీ) గురించి ఏ మాత్రం అవగాహన లేని వారు సైతం ఎంబీబీఎస్‌లుగా బోర్డులు వేసుకుని ప్రైవేట్ క్లినిక్‌లు తెరిచి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

కాసుల కక్కుర్తి..

ప్రైవేట్ క్లినిక్ నిర్వాహకులు ప్రజారోగ్యం కంటే డబ్బుకే అత్యధిక ప్రాధాన్యతనిస్తూ వైద్య సేవలు అందిస్తున్నారు. రోగి తమ ఆస్పత్రి మెట్లు ఎక్కిన దగ్గర నుంచి గడప దాటేలోపు ఎంత లేదన్నా.. వివిధ వైద్య పరీక్షల పేరుతో రూ.వేలు దోచేస్తున్నారు. ఇక ఆర్‌ఎంపీల వద్దకెళ్లితే రోగమొకటైతే... చికిత్స మరొకటిగా ఉంటోంది. ఎలాంటి అవగాహన లేకుండా ఆర్‌ఎంపీలు అందజేస్తున్న చికిత్స ఒక్కోసారి వికటించి ప్రాణాల మీదకు తెస్తోంది. ఏడాది క్రితం కొత్తచెరువులో అనధికారికంగా నిర్వహిస్తోన్న క్లినిక్‌ను సీజ్ చేసి.. ఆర్‌ఎంపీ గుర్రం కిరణ్‌పై కేసు నమోదు చేశారు. స్పెషలైజేషన్ చేయకుండా చిన్న పిల్లలకు ఆయన వైద్యం చేసేవాడు. అయితే ఓ చిన్నారికి వైద్యం వికటించి సీరియస్ కావడంతో సమస్య వెలుగు చూసింది. తాజాగా తనకల్లులో ఆర్‌ఎంపీ అబ్దుల్లా ఇచ్చిన ఇంజక్షన్ వికటించి ఓ మహిళ మృతి చెందింది. దీనిపై ప్రజాసంఘాలు ఆందోళన చేపట్టాయి. అయినా సదరు ఆర్‌ఎంపీపై ఇప్పటి వరకూ ఎలాంటి కేసు నమోదు కాలేదు. కేవలం క్లినిక్‌ను సీజ్ చేసి వైద్యాధికారులు చేతులు దులుపుకున్నారు.

ప్రతిదీ వ్యాపారమే..

గ్రామీణ ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు జరిగితే వెంటనే సమీపంలోని ఆర్‌ఎంపీ క్లినిక్‌కు క్షతగాత్రుడిని తీసుకెళుతుంటారు. అక్కడ నిబంధనల మేరకు ఆర్‌ఎంపీ ప్రథమ చికిత్స చేసి వెంటనే ఫలానా ప్రైవేట్ ఆస్పత్రికి మాత్రమే వెళ్లండని సూచిస్తుంటారు. అక్కడ కాకుండా మరో ఆస్పత్రికి వెళితే ప్రాణాలకు గ్యారంటీ ఉండదని భయపెడతుంటారు. ఆర్‌ఎంపీ మాటలు విని సదరు ఆస్పత్రికి వెళితే రూ.లక్షల్లో బిల్లు చెల్లించుకోకతప్పదు. ఇందులో 20 శాతం కమీషన్ సదరు ఆర్‌ఎంపీకి ఉంటుంది. పట్టణ ప్రాంతాల్లో అయితే ఎంబీబీఎస్ డాక్టర్లు నిర్వహిస్తున్న క్లినిక్‌కు వెళ్తే.. అక్కడి నుంచి హైదరాబాద్ లేదా బెంగళూరు ఆస్పత్రులకు రెఫర్ చేస్తారు. అక్కడ కూడా రూ.లక్షల్లో బిల్లు చెల్లించుకోకతప్పదు. ఇందులో సుమారు 40 శాతం వరకూ కమీషన్‌ను రెఫరల్ డాక్టరకు ఆయా కార్పొరేట్ ఆస్పత్రులు చెల్లిస్తుంటాయి. ప్రజల అనారోగ్యాన్ని చాలా మంది డాక్టర్లు వ్యాపారంగా మార్చేసి దోపిడీ సాగిస్తున్నారు.

నిబంధనలు గాలికి..

నిబంధనల ప్రకారం ప్రభుత్వ అధికారులు ప్రతి మూడు నెలలకు ఓసారి ప్రైవేటు ఆస్పత్రులను తనిఖీ చేయాలి. అయితే జిల్లాలో ఎక్కడేగాని ఈ నిబంధన అమలు కావడం లేదు. ప్రైవేటు ఆస్పత్రులు ఆన్‌లైన్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ సమయంలో నిర్వాహకులు పేర్కొన్న డాక్టర్ ఏడాది తర్వాత ఆ ఆస్పత్రిలో కనిపించరు. ఆయన బదులు మరో డాక్టర్‌ను ఏర్పాటు చేసుకుంటారు. ఈ మార్పు జరిగిన వెంటనే రిజిస్ట్రేషన్‌లోనూ మార్పు చేయించుకోవాలి. అయితే ఏ ఆస్పతిర్లోనూ ఈ నిబంధన పాటించడం లేదు. ప్రైవేటు ఆస్పత్రుల్లో పూర్తి స్థాయిలో శిక్షణ పొందిన వైద్యులు ఉండాలి. కానీ ఎక్కడేగాని అలాంటి వారు కనిపించరు. కొన్ని ఆస్పత్రుల్లో కనీసం ఫైర్ సేఫ్టీ నిబంధనలు కూడా ఉండవు.

అనుమతులు లేకుండానే..

ఎలాంటి అనుమతులు లేకున్నా ఆర్‌ఎంపీలు చాలా గ్రామాల్లో క్లినిక్‌లు ఏర్పాటు చేసుకుని నాలుగైదు గదుల్లో పడకలు ఏర్పాటు చేసి, ఖరీదైన వైద్య సేవలు అందజేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగానే వీరి చికిత్సలు ఉంటాయి. పక్కనే మెడికల్ షాపులను ఏర్పాటు చేయించి, నిర్వాహకులతో కమీషన్లు దండుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ తతంగం ఉన్నతాధికారుల దృష్టికెళ్లినా... తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం.

కఠిన చర్యలు తీసుకుంటాం



ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటాం. ఏ డాక్టర్ పేరుతో ఆస్పత్రి రిజిస్ట్రేషన్ ఉంటుందో... ఆ డాక్టరే అక్కడ తప్పనిసరిగా ఉండాలి. డాక్టర్ మారితే రిజిస్ట్రేషన్‌లో పేరు మార్చుకోవాలి. అర్హత, అనుభవం లేని వారు ల్యాబ్‌లు నిర్వహించరాదు. నిబంధనలు పాటించని వారి జాబితా సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపిస్తాం. అర్హత లేని వైద్యులపై క్రిమినల్ కేసు నమోదుకు సిఫారసు చేస్తాం.

– డాక్టర్ మంజువాణి, డీఎంహెచ్‌ఓ

వ్యక్తి హత్య


అంజినప్ప (ఫైల్)

పెనుకొండ రూరల్: మతిస్థిమితం లేని వ్యక్తి చేతిలో ఓ వ్యాపారి దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... హిందూపురంలోని బోయపేటకు చెందిన ఎరికల అంజినప్ప (64) ద్విచక్ర వాహనంపై పూజా సామగ్రిని తీసుకెళ్లి సమీప గ్రామాల్లో విక్రయించేవాడు. ఆయనకు భార్య, ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రోజు లాగే మంగళవారం గుట్టూరు సమీప గ్రామాలలో విక్రయించి, సాయంత్రం గ్రామంలోని కొల్లాపురమ్మ ఆలయంలో బస చేశాడు. అదే సమయంలో అక్కడకు మునిమడుగు గ్రామానికి చెందిన బోయ గంగాధర్ చేరుకున్నాడు. కొంతకాలంగా మతిస్థిమితం లేక గ్రామాలలో తిరిగే వాడు. తన తండ్రి రామచంద్రతో గంగాధర్‌కు భూ వివాదం ఉంది. ఈ క్రమంలో ఒంటరిగా ఎవరిని చూసినా తనను హతమార్చేందుకే వచ్చారని భావించి గొడవ పడేవాడు. మంగళవారం అర్ధరాత్రి ఆలయంలో బస చేసిన అంజినప్పను చూసి తనను హతమార్చడానికే వచ్చాడనే అనుమానంతో గంగాధర్ గొడవపడ్డాడు. ఎంత నచ్చచెప్పినా వినకుండా టవాలును అంజినప్ప మెడకు బిగించి ఆలయం నుంచి బయటకు ఈడ్చుకెళ్లాడు. కొట్టుకుంటూ 44వ జాతీయ రహదారిపైకి తీసుకెళ్లి అనంత టెక్ పరిశ్రమకు వెళ్లే మార్గంలో ఈద్గా వద్దకు చేరుకోగానే టవాల్‌తో గొంతు బిగించి హతమార్చాడు. ఘటనపై బుధవారం ఉదయం కియా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వివాహిత ఆత్మహత్య

పెద్దవడుగూరు: మండలంలోని ముప్పాలగుత్తిలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... కుటుంబసభ్యులతో కలసి హైదరాబాద్‌లో నివాసముంటున్న వివాహిత సుమిత్ర (22) మొహర్రం సందర్భంగా గ్రామానికి వచ్చారు. బుధవారం కుటుంబసభ్యులందరూ మొహర్రం వేడుకల్లో నిమగ్నమై ఉండగా, ఇంటి వద్ద ఒంటరిగా ఉన్న సుమిత్ర ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ చిన్న రెడ్డప్ప అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. కాగా, సుమిత్ర ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

నేత్రపర్వం... అక్కమ్మ గార్ల ఉత్సవం


పోటీలలో పరుగెడుతున్న ఎడ్లబండి

పుట్టపర్తి అర్బన్: మండలంలోని పెడపల్లి సమీపంలో దొడ్డిగుండ్లు గవిలో వెలసిన అక్కమ్మగార్ల జాతర బుధవారం అట్టహాసంగా ముగిసింది. మూడు రోజులుగా భక్తిశ్రద్ధలతో వేడుకలను గ్రామస్తులు నిర్వహిస్తూ వచ్చారు. తొలి ఏకాదశి సందర్భంగా ఏటా మూడు రోజుల పాటు గ్రామానికి చెందిన కాయల వంశీయులు ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ముగింపు ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్థానిక ఆర్‌ఎంపీ రాఘవేంద్ర ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు. చివరి రోజు ఎడ్లబండి పరుగు పందెం పోటీలు హోరాహోరీగా సాగాయి. జెండా ఊపి పోటీలను మాజీ సర్పంచ్ శ్రీరామ్‌నాయక్, కాయల రాము ప్రారంభించారు. మొదటి బహుమతిని నల్లగుట్టపల్లి రాము, రెండవ బహుమతిని కొత్తచెరువు కేశవ, మూడో బహుమతిని బుక్కపట్నం జంగం శ్రీనివాసులు దక్కించుకున్నారు.


ప్రత్యేక అలంకరణలో అక్క మహాదేవతల విగ్రహాలు


నెమలి ఈకలతో నివేదన చేస్తున్న బాలురు

ఖాద్రీశుడికి పూజలు


అలంకరణలో ఖాద్రీశుడు


భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయ ప్రాంగణం

కదిరి టౌన్: ఏకాదశి పండుగ సందర్భంగా పట్టణంలోని ఖాదీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. కర్ణాటక, కడప, చిత్తూరు, అనంతపురం జిల్లాల నుంచి భక్తులు ఉపవాసాలతో ఖాద్రీశుడిని దర్శించుకున్నారు. మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి దీపాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

గ్రామాల్లో పర్యటించిన స్పెయిన్ బృందం


బీజీ హళ్లిలో పర్యటిస్తున్న స్పెయిన్ దేశస్తులు

రొళ్ల: మండలంలోని జీజీ హట్టి, బీజీ హళ్లి, హెచ్‌టీ హళ్లి గ్రామాల్లో బుధవారం స్పెయిన్ బృందం సభ్యులు అనా, కరీల, రాకెల్ పర్యటించారు. జీజీ హట్టిలో యాదవుల ఆచారం ప్రకారం కాన్పు జరిగిన తర్వాత మూడు నెలల వరకూ ఊరి బయట చంటి బిడ్డతో కలసి ఉంటున్న బాలింత అనితను కలసి మాట్లాడారు. ఆమె ఆరోగ్య విషయంపై ఆరా తీశారు. అనంతరం మహిళలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఇక్కడి ఆచారాలు, అవలంబిస్తున్న విధానాలను ట్రాన్స్‌లేటర్ తులసి, ఏటీఎల్ ఓబులేసు తదితరులు స్పెయిన్ దేశస్తులకు వివరించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి ఒక్కరిలోనూ మార్పు రావాలని ఈ సందర్భంగా వారు సూచించారు. బాలికలకు పెళ్లిళ్లు చేయడం వల్ల కలిగే అనర్థాలపై చైతన్య పరిచారు. ఆడపిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వారికి ఉన్నత చదువులు చెప్పించాలని సూచించారు. ఆర్డీటీ సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. బీజీ హళ్లిలో ఒంటరి మహిళ లక్ష్మమ్మకు ఆర్డీటీ ద్వారా ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసుకున్న కిరాణాషాపును పరిశీలించారు. అనంతరం హెచ్‌టీ హళ్లిలో రూ.4 లక్షల వ్యయంతో ఆర్డీటీ నిర్మించి ఇచ్చిన ఇంట్లో యజమాని అమ్మజక్కతో గృహ ప్రవేశం చేయించారు. కార్యక్రమంలో ఆర్డీటీ సీఓలు హనుమంతరాయుడు, వెంకటేష్ పాల్గొన్నారు.

మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలి

- రాష్ట్రోపాధ్యాయ సంఘం డిమాండ్



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు సాయిశ్రీనివాస్


హాజరైన కార్యవర్గ సభ్యులు

అనంతపురం ఎడ్యుకేషన్: పీఆర్సీ 12కి సంబంధించిన మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని, ఈ విషయంలో ఎలాంటి ఆలస్యం చేయకుండా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాలని ప్రభుత్వాన్ని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు ఎల్. సాయి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఎస్టీయూ అనంతపురం జిల్లా ప్రథమ కార్యవర్గ సమావేశం బుధవారం అనంతపురంలోని సీపీఐ కార్యాలయంలో జరిగింది. ఆ శాఖ జిల్లా అధ్యక్షుడు ఎస్.రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సాయి శ్రీనివాస్ మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. 12వ పీఆర్సీలో భాగంగా మధ్యంతర భృతిని ప్రకటించి గత పీఆర్సీకి సంబంధించిన బకాయిలు, పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏపీజీఎల్ఐ ఫైనల్ పేమెంట్లు, మెచ్యూర్ అయిన బాండ్ల పేమెంట్లు వెంటనే చెల్లించేలా ఆర్థిక శాఖను ఆదేశించాలన్నారు. మునిసిపల్ ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు, జీపీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయినులకు ఎంటీఎస్ అమలు చేస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న జీఓ 117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 3, 4, 5 తరగతుల విలీనాన్ని రద్దు చేసి ప్రతి తరగతికి ఉపాధ్యాయుడిని కేటాయించాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమం కొనసాగించాలన్నారు. ఉపాధ్యాయులకు పనిభారం తగ్గించి, పాఠశాలల సమాచారం పంపడానికి వీలుగా ఉన్నత పాఠశాలలకు, స్కూల్ కాంప్లెక్స్‌కు డిజిటల్ అసిస్టెంట్ ను కేటాయించాలని కోరారు. తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకే వర్తింపజేయాలన్నారు. 1998, 2008 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయులకు 62 ఏళ్ల ఉద్యోగ విరమణ వయస్సు, రెగ్యులర్ ప్రాతిపదికన నియామకం చేయాలన్నారు. విద్యారంగ, ఆర్థిక సమస్యలను పరిష్కరించడానికి ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలను చర్చలకు పిలవాలన్నారు. సమావేశంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. రామాంజనేయులు, ఆర్థిక కార్యదర్శి జి.ప్రసాద్, జిల్లా ఇన్‌చార్జ్ సి.నాగరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.సూర్యుడు, కె.చంద్ర శేఖర్, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సీనియర్ నాయకులు గోవిందు, శివయ్య చారి, మాజీ అధ్యక్షులు రామన్న, గోవిందు, నారాయణస్వామి, ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్స్ సురేష్ కుమార్, కృష్ణ మోహన్, ఫణి భూషణ్, మల్లికార్జున గౌడ్, ఆనంద్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రమాదంలో ఒకరి మృతి


నరసయ్య (ఫైల్)

పెద్దవడుగూరు: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... పెద్దవడుగూరు మండలం విరుపాపురం గ్రామానికి చెందిన నరసయ్య (24), తన అన్న శంకర్‌తో కలసి ద్విచక్రవాహనంపై బుధవారం రాత్రి పెద్దవడుగూరుకు బయలుదేరాడు. మండల కేంద్రం సమీపంలోకి చేరుకుంటుండగా వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. తీవ్రంగా గాయపడిన నరసయ్య, శంకర్‌ను స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే నరసయ్య మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై ఎస్‌ఐ చిన్నరెడ్డప్ప కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి బలవన్మరణం


మృతుడు బషీర్

ఉరవకొండ: జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఉరవకొండలోని లక్ష్మీనృసింహస్వామి కాలనీలో నివాసముంటున్న బషీర్(51)కు భార్య, ఓ కుమార్తె ఉన్నారు. వెల్డింగ్ పనులతో జీవనం సాగించేవాడు. సరైన పనులు లేక ఆర్థిక ఇబ్బందులతో సతమయ్యేవారు. ఈ క్రమంలో కుటుంబంలో కలహాలు మొదలయ్యాయి. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన ఆయన బుధవారం కుటుంబసభ్యులు మొహర్రం వేడుకల్లో పాల్గొనేందుకు వెళ్లిన సమయంలో ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి ఆయనను కాపాడి, 108 అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బషీర్ మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వైభవం... పాండురంగడి రథోత్సవం


విశేష అలంకరణలో దర్శనమిస్తున్న మూలవిరాట్

హిందూపురం: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని ముదిరెడ్డిపల్లిలో వెలసిన రుక్మిణీపాండురంగ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలి ఏకాదశిని పురస్కరించుకుని బుధవారం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, విశేష అలంకరణ, పూజలు జరిగాయి. అనంతరం మడుగుతేరు, మండల పూజ, అగ్నిప్రతిష్ఠాపన, దీక్షాహోమం, గణపతి, నవగ్రహ, మృత్యుంజయ హోమాలను నిర్వహించారు. పూర్ణాహుతి అనంతరం రథం ఎదుట రథాంగహోమం, అష్టదీక్ష బలిప్రదానం చేశారు. మేళతాళాలతో రుక్మిణి సమేత పాండురంగస్వామి ఉత్సవమూర్తులను ప్రాకారోత్సవంతో తీసుకువచ్చి రథంపై అధిష్ఠింపజేశారు. వేదపండితుల పూజలనంతరం పెద్దఎత్తున భక్తులు గోవింద నామస్మరణతో రథాన్ని ముందుకు లాగారు. సాయంత్రం హరినామ సంకీర్తన వీనులవిందుగా సాగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పల్లా లక్ష్మీకుమార్, చింతా గోపాల్, మంజునాథ్, శ్రీధర్‌బాబు, కౌన్సిలర్ జయప్ప తదితరులు పాల్గొన్నారు.


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు